మంత్రి సీతక్కకు జర్నలిస్టు జేఏసీ వినతి

మంత్రి సీతక్కతో మాట్లాడుతూన్న జేఏసీ నాయకులు

ఎదులాపురం, జూలై 1 : జర్నలిస్టులపై అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు బెదిరింపులకు దిగడంతో పాటు కేసులు పెట్టించే ప్రయత్నం చేస్తున్నారని వీటిని నివారించాలని జర్నలిస్టు జేఏసీ నాయకులు కోరారు. సోమవారం జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర మంత్రి సీతక్కకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జేఏసీ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల ఆదిలాబాద్ లోకసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పరాజయంపై విశ్లేషణాత్మక వార్త రాసిన ఓ ఛానల్ జర్నలిస్టును అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు బెదిరించడమే కాకుండా ఇతరులతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టించే ప్రయత్నం చేశారని గుర్తుచేశారు. ప్రభుత్వ వ్యతిరేక వార్తలు రాశారనే కారణంగా మరో ఇద్దరు విలేకరులను పోలీసు స్టేషన్‌కు పిలిపించారని అన్నారు. వార్తలు రాసిన జర్నలిస్టులపై కేసులు పెట్టడం వంటి చర్యలు ప్రజాస్వామ్యానికి, ప్రతిక స్వేచ్ఛకు విరుద్ధమని వివరించారు. సదరు వ్యక్తులపై చర్యలు తీసుకోవడంతో పాటు భవిష్యత్‌లో జర్నలిస్టులపై దాడులు ,బెదిరింపులు ,కేసులు నమోదు చేయించడం వంటి పరిణామాలు లేకుండా చూడాలని కోరారు. అంతకు ముందు స్థానిక మావల పార్కుకు వెళ్లిన జర్నలిస్టులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపే ప్రయత్నం చేయగా పోలీసులు తొలత అనుమతించలేదు. నినాదాలు కాకుండా శాంతియూతంగా పోగ్రామ్ కవరేజ్ చేస్తామని చెప్పడంతో అనుమతించారు. అనంతరం వినతిపత్రం అందించగా స్పందించిన మంత్రి అలాంటి ఘటనలు జరగకుండా చూస్తామని భరోసా ఇచ్చారు.

ఇండ్ల స్థలాలు అందిస్తాం...

జిల్లాకు వచ్చిన మంత్రి సీతక్కకు జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని మంత్రిని కోరగా దీనికి సంబంధించి విధి విధానాలు రూపొందిస్తున్నామని త్వరలోనే అందజేసేందుకు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. కలిసిన వారిలో జేఏసీ కన్వీనర్ నూకల దేవేందర్, కోకన్వీనర్ బిర్కుర్వర్ వెంకటేశ్, జర్నలిస్టు జేఏసీ నాయకులు ఉన్నారు.

మంత్రి సీతక్కకు అంగన్‌వాడీల వినతి

ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర మంత్రికి సీతక్కకు సోమవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ టీఎన్జీవోస్ అనుబంధ సంఘం ఆధ్వర్యంలో కలిశారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీసం వేతనం రూ.18వేలు చెల్లించి, ఉద్యోగ విరమణ పొందిన వారికి రూ.2లక్షలు చెల్లించాలన్నారు. ఆరోగ్యలక్ష్మి బిల్లులు , వేతనాలు చెల్లించాలపి కోరారు. కలిసిన వారిలో అధ్యక్షురాలు రాధ, సభ్యులు కవిత, సుజాత, నర్సమ్మ ఉన్నారు.

మొక్కలను సంరక్షించాలి

తాంసి, జూలై 1 : రెవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని ఎంపీడీవో మోహన్‌రెడ్డి అన్నారు. పొన్నారి గ్రామంలో చేపడుతున్న రెవెన్యూ ప్లాంటేషన్‌ను ఎంపీడీవో పరిశీలించారు. మొక్కల వివరాలు అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బండి విజయ్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ చెన్నాల అశోక్, ప్రదీప్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా వైద్యుల దినోత్సవం

వాసవి పాఠశాలలో డాక్టర్, ఫ్రూట్స్ డేలో పాల్గొన్న విద్యార్థులు

నిర్మల్ అర్బన్, జూలై 1 : నిర్మల్‌లోని వాసవి వరల్డ్ పాఠశాలలో సోమవారం వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు డాక్టర్ వేషధారణలో వచ్చి పలువురిని ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ ప్రశాంత్ మాట్లాడుతూ పిల్లలు చిన్నప్పటి నుంచి ఆహారపు అలవాట్లు, శారీరక వ్యాయామం, ఎముకల దృఢత్వం గురించి ఎలాంటి ఆహారం తీసుకోవాలో వివరించారు. అనంతరం పాఠశాలలో ఇంటర్నేషనల్ ఫ్రూట్స్ డేను నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల పండ్ల ఆకారాల్లో వేషధారణ చేపట్టారు. పండ్ల ప్రాధాన్యతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వాసవి వరల్డ్ స్కూల్ సెక్రటరీ జగదీశ్ రెడ్డి, ప్రిన్సిపాల్ శైలజాయ్‌సన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్యుడికి సన్మానం

భైంసా, జూలై 1 : పట్టణంలోని ఏరియా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ కాశీనాథ్‌ను డాక్టర్స్ డే సందర్భంగా వికాస్ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ రవీనా, ప్రిన్సిపాల్ రాజన్న, కరస్పాండెంట్ రత్న శేఖర్, వైస్ ప్రిన్సిపాల్ రత్న పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

భైంసా, జూలై 1 : భైంసాలో బీజేపీ ఆధ్వర్యంలో వైద్యులు రాజారెడ్డి, ముత్యం రెడ్డి, అనిల్ కుమార్, రామకృష్ణ గౌడ్, విజయానంద్, దామోదర్ రెడ్డిలను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఎనుపోతుల మల్లేశ్, నాయకులు పోశెట్టి, సాహెబ్ రావు పాల్గొన్నారు.

ఖానాపూర్, జూలై 1: ఖానాపూర్‌లో వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన డాక్టర్ దినేశ్, సౌజన్య, నితీశ్‌రాజాను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో రీజియన్ చైర్‌పర్సన్ మహజన్ జితేందర్, వనిత క్లబ్ అధ్యక్షురాలు చిటికేసి మానస, ప్రధాన కార్యదర్శి స్రవంతి, చొల్లేటి శ్వేత, స్వాతి పాల్గొన్నారు.

ముథోల్ : డాక్టర్ కాశీనాథ్‌ను సన్మానిస్తున్న వికాస్ పాఠశాల సిబ్బంది

భైంసా : వైద్యులను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

సమయపాలన పాటించని అధికారులు

తాంసి, జూలై 1 : మండలకేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో పని చేస్తున్న అధికారులు సమయపాలన పాటించకుండా జిల్లా కలెక్టర్ ఆదేశాలను పట్టించుకోవడం లేదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిలక దేవిదాస్ అన్నారు. సోమవారం తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయంలో సందర్శించగా పూర్తిస్థాయిలో అధికారులు సమయపాలన పాటించడం లేదని ఆరోపించారు. మండల కార్యాలయాలతోపాటు గ్రామస్థాయిలోనూ పంచాయతీ అధికారులు గైర్హాజరవుతారని ఎంపీడీవో మొర పెట్టుకున్నారు. నర్సరీల్లో మొక్కల సంరక్షణ చర్యలు చేపట్టలేదని అన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి అధికారులు సమయపాలన పాటించడం లేదని తహసీల్దార్‌తో ఫోన్‌లో వాపోయారు. తహసీల్దార్‌కు పుట్టినరోజు వేడుకలు ఉండడంతో ఆలస్యం జరిగిందని పొన్నారి వరకు వచ్చానని సీపీఐ నాయకులకు వివరించారు. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి సమయపాలన పాటించాలని లేదంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని సీపీఐ నాయకులు, అధికారులకు హెచ్చరించారు.

ఎంపీడీవోకు వివరిస్తున్న సీపీఐ నాయకులు దేవిదాస్

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రారంభం

కుంటాల, జూలై 1: గ్రామస్తులు విరాళాలు సేకరించి కళాశాలకు అవసరమైన కనీస వసతులను కల్పించడం అభినందనీయమని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి జాదవ్ పరశురాం అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఎంపీపీ గజ్జారాంతో పాటు కలిసి ప్రభుత్వ జూనియర్ కళాశాలను ప్రారంభించారు. గ్రామం తరపున ఉచితంగా తరగతులు బోధించడానికి ముందుకొచ్చిన తాత్కాలిక అధ్యాపకులను అభినందించారు. గతంలో కుంటాలలో మోడల్ స్కూల్ స్థాపనకు కృషి చేసినట్టే ఈ కళాశాలకు కూడా స్థలం గుర్తించి భవన నిర్మాణానికి సహకరిస్తామని ఎంపీపీ అప్క గజ్జారాం అన్నారు. చుట్టుపక్కల గ్రామాల విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో ప్రవేశం పొంది ఉచిత పుస్తకాలు, స్కాలర్‌షిప్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ తుకారాం, టీజీఎల్ఏ జిల్లా అధ్యక్షుడు వినోద్ కుమార్, జీజేఎల్ఏ అధ్యక్షుడు రవి కిరణ్, జీజేఎల్ఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్యపాల్, జేఎల్ భోజరాం, జడ్పీ హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం నాగ్‌నాథ్, మోడల్ స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ శ్రీకాంత్, కృష్ణారావు, తాటి శివ, జక్కుల గజేందర్, రమణారావు, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో ఏఈకి వినతి

ఏఈ అజీముద్దీన్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీ వాసులు

కుభీర్, జూలై 1 : మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఆ శాఖ ఏఈ అజీముద్దీన్‌కు బీసీ కాలనీ వాసులు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. గత కొన్నేళ్లుగా ఆ కాలనీలోని నివాస గృహాలపై నుంచి వేసిన 11 కేవీ విద్యుత్ తీగలు తొలగించకపోవడంతో పలుమార్లు అగ్ని ప్రమాదాలు సంభవించి పలు ఇళ్లు కాలిపోయాయి. ఈ విషయమై ఎన్నోసార్లు అధికారులకు విన్నవించిన న్యాయం జరగకపోవడంతో కొద్ది రోజుల క్రితం కుభీర్‌లో జరిగిన విద్యుత్ లోక్ అదాలత్‌లో సమస్యను వివరించగా వారు ఆ లైన్‌ను షిఫ్ట్ చేయించేందుకు రూ.4.30 లక్షలు డీడీలు అందించాలని సూచించారు. కాలనీవాసులందరూ కలిసి డీడీలు చెల్లించినప్పటికీ విద్యుత్ శాఖ అధికారులు తాత్సారం ప్రదర్శించడంతో ఇటీవల వరంగల్‌లో ఆ శాఖ సీఎండీని కలిసి సమస్యను విన్నవించారు. తాజాగా సోమవారం కుభీర్ ఏఈకి కాలనీవాసులు సమస్యను వివరిస్తూ వినతి పత్రం అందజేశారు. ఇక్కడ హన్మండ్లు, పోతన్న, పండరి, శంకర్, కాలనీవాసులు ఉన్నారు.

సబ్ డివిజన్ డీఈగా రాజేందర్‌రావు

రాజేందర్‌రావును సన్మానిస్తున్న నాయకులు, అధికారులు

దిలావర్‌పూర్, జూలై 1 : పంచాయతీ రాజ్ సబ్ డివిజన్ దిలావర్‌పూర్ డీఈగా రాజేందర్‌రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు నిర్మల్ డివిజన్ ఇన్‌చార్జి డీఈగా తుకారాం పని చేశాడు. ఆయన స్థానంలో రెగ్యులర్ డీఈగా రాజేందర్‌రావు బాధ్యతలు స్వీకరించడంతో ఆయా డివిజన్ పరిధిలోని పీఆర్ఏఈలు, వివిధ పార్టీల నాయకులు, ఎంపీపీ అక్షర, అనిల్ కలిసి ఆయనను శాలువాతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంచాయతీ రాజ్ పరిధిలో వచ్చే పనుల అభివృద్ధిలో తన వంతు సహకారం అందిస్తానని అన్నారు. ఇక్కడ ఎంపీడీవో అరుణరాణి, ఎంపీవో అజీజ్‌ఖాన్, పీఆర్ఏఈ శివకృష్ణ, ఎంపీడీవో కార్యాలయ అధికారులు రమణ, నాయకులు అనిల్, అర్గుల రమణ, కృష్ణ తదిరులు ఉన్నారు.

'ప్రజావాణి'ని వినియోగించుకోవాలి

దస్తురాబాద్, జూలై 1 : ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని తహసీల్దార్ సర్పరాజ్ నవాజ్ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో సోమవారం ఆయా శాఖాల అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీవో అనిల్ కుమార్, ఏపీఎం గంగాధర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్,రాధ, తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌కు వట్టికోట ఆళ్వారు స్వామి స్మారక అవార్డు

అవార్డును అందజేస్తున్న సంస్థ సభ్యులు

ఖానాపూర్ రూరల్, జూలై 1: హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సోమవారం నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవంలో ఖానాపూర్ పట్టణానికి చెందిన రుద్ర శంకర్ వట్టికోట ఆళ్వారు స్వామి స్మారక అవార్డును అందుకున్నారు. ఈ అవార్డును మహాకవి బోయ భీమన్న సతి మణి హైమవతి భీమన్న చేతుల మీదుగా అందుకున్నారు. ఇందుకుగాని పట్టణవాసులు, స్నేహితులు అభినందించారు. కార్యక్రమంలో మామిడి హరికృష్ణ, తంగెళ్లపల్లి కనకాచారి, బీఆర్ఆర్ చారి, లలిత వాణి, హరిత్, జయసూర్య పాల్గొన్నారు.

రోడ్డుపై పడిన చెట్టు

ఇబ్బంది పడిన వాహనదారులు

ప్రధాన రోడ్డుపై పడిపోయిన చెట్టు

ఉట్నూర్ రూరల్, జూలై 1 : మండలంలోని దంతన్‌పెల్లి గ్రామ సమీపంలో ప్రధాన రహదారిపై సోమవారం చెట్టు విరిగి పడడంతో ప్రయాణికులు వాహనదారులు ఇబ్బంది పడ్డారు. సుమారు గంట సమయం వరకు ప్రయాణికులు వేచి చూడవలసి వచ్చింది. అటుగా కారులో వెల్తున్న ఇంద్రవెల్లి మాజీ మార్కెట్ చైర్మన్ శ్రీరాం జాదవ్ గ్రామస్తులు, ప్రయాణికులతో చెట్టును కొంత భాగం తొలగింపజేసి రాకపోకలు పునరుద్ధరించారు. అప్పటికి అధికారులు పట్టించుకోక పోవడంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు. తరచు అటవి ప్రాంతంలో రోడ్డుపై చెట్లు పడిపోవడంతో వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. రోడ్డు ప్రక్కన ఎండిన చేట్లు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

బీఎస్ఎన్ఎల్ రూ.249 ప్లాన్

45 రోజుల వ్యాలిడిటీ.. రోజూ 2జీబీ టెలికం ఇండస్ట్రీలో హాట్ టాపిక్

న్యూఢిల్లీ, జూలై 1: దేశీయ ప్రభుత్వ రంగ టెలికం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) కొత్త కస్టమర్లను ఆకట్టుకోవడానికి ఓ నయా ప్లాన్‌ను పరిచయం చేసింది. దీని రేటు రూ.249 మాత్రమే. కాలవ్యవధి 45 రోజులు. అన్‌లిమిటెడ్ కాల్స్‌తో ఉన్న ఈ ఆకర్షణీయ ప్యాకేజీలో రోజూ 2జీబీ డాటా, 100 ఉచిత ఎస్ఎంఎస్‌లను వినియోగదారులు వాడుకోవచ్చు. అయితే ప్రైవేట్ రంగ టెలికం కంపెనీలు రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా.. ఇటీవలే తమ ప్లాన్ల ధరలను భారీగా పెంచుతున్నట్టు ప్రకటించిన నేపథ్యంలో బీఎస్ఎన్ఎల్ ప్లాన్ ఇప్పుడు టెలికం ఇండస్ట్రీలో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంటున్నది. అధిక టారీఫ్‌ల నుంచి ఉపశమనాన్ని కోరుకునే మొబైల్ యూజర్లను ఆకట్టుకునేందుకే బీఎస్ఎన్ఎల్ తక్కువ ధరకే ఎక్కువ ప్రయోజనాలున్న ఈ ప్లాన్‌ను తీసుకొచ్చిందన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. నిజానికి ఇతర టెలికం కంపెనీలు ఇదే ధర (రూ.249)కు రోజుకు 1జీబీ డాటానే ఇస్తుండగా, వ్యాలిడిటీ కూడా 28 రోజులే ఉంటుండటం గమనార్హం. దీంతో బీఎస్ఎన్ఎల్ నూతన ప్లాన్‌లో రోజువారీ డాటా రెట్టింపవడమేగాక, ప్లాన్ గడువు కూడా 17 రోజులు పెరుగుతున్నది. ప్రస్తుత పరిస్థితుల్లో మొబైల్ వినియోగదారులకు ఇది గొప్ప ఊరటగానే చెప్పుకోవచ్చు. ఇదిలావుంటే బుధవారం నుంచి జియో, ఎయిర్‌టెల్.. గురువారం నుంచి వొడాఫోన్ ఐడియా తమ ప్లాన్ల ధరలను దాదాపు 26 శాతం మేర పెంచుతున్నాయి. దీంతో ఒక్కో వినియోగదారునిపై గరిష్ఠంగా రూ.600 భారం పడబోతున్నది.

బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో గోల్డెన్ పీకాక్ అవార్డును అందుకుంటున్న ఎల్ అండ్ టీ మెట్రో ఎండీ, సీఈవో కేవీబీ రెడ్డి

ఉన్నత శిఖరాలకు సూచీలు

సెన్సెక్స్ 443, నిఫ్టీ 131 పాయింట్ల వృద్ధి

ముంబై, జూలై 1: దేశీయ స్టాక్ మార్కెట్ల రికార్డుల పరంపర కొనసాగుతున్నది. బ్యాంకింగ్, ఐటీ రంగ షేర్ల నుంచి లభించిన మద్దతుతో సూచీలు మరో ఉన్నత శిఖరానికి చేరుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లు ముఖ్యంగా ఆసియా, యూరోపియన్ సూచీలు లాభాల్లో మునిగియడంతో దేశీయ మదుపరుల్లో ఉత్సాహాన్ని నింపింది. ఒక దశలో 500 పాయింట్లకు పైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 443.46 పాయింట్లు అందుకొని ఆల్-టైం హైకి 79,476.19 పాయింట్లకు చేరుకున్నది. 30 షేర్ల ఇండెక్స్‌లో 20 షేర్లు లాభపడగా, 10 షేర్లు నష్టాల్లోకి జారుకున్నాయి. మరో సూచీ నిఫ్టీ 24 వేల పాయింట్ల పైన ముగిసింది. 131.35 పాయింట్లు అందుకొని 24,141.95 వద్ద స్థిరపడింది. దీంతో బీఎస్ఈలో లిస్టైన కంపెనీల విలువ రూ.4,43,05,344.036 కోట్లకు చేరుకున్నది.

- టెక్ మహీంద్రా, అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌యూఎల్, టీసీఎస్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఇన్ఫోసిస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టాటా మోటర్స్, ఐసీఐసీఐ బ్యాంక్‌లు లాభాల్లో ముగిశాయి.
- ఎన్‌టీపీసీ, ఎస్బీఐ, లార్సెన్ అండ్ టుబ్రో, సన్‌ఫార్మా, ఇండస్‌ఇండ్, యాక్సిస్ బ్యాంక్‌లు నష్టాల్లోకి జారుకున్నాయి.
- ఐటీ అత్యధికంగా 1.84 శాతం లాభపడగా.. టెక్ 1.46 శాతం, కమోడిటీస్ 1.21 శాతం, టెలికమ్యూనికేషన్ 1.03 శాతం, మెటల్ రంగ సూచీలకు మదుపరుల నుంచి మద్దతు లభించింది.

అంతర్జాతీయ పేమెంట్స్ కోసం..

వివిధ ఆసియా దేశాలతో కలిసి వెళ్తున్న ఆర్బీఐ

ముంబై, జూలై 1: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ).. మలేషియా, సింగపూర్ సహా నాలుగు ఆసియా దేశాలు కలిసి వేగవంతమైన రిటైల్ పేమెంట్స్ కోసం ఓ వేదికను ఏర్పాటు చేయాలని నిర్ణయించాయి. 2026లో ఇది అందుబాటులోకి రావచ్చన్న అంచనాలున్నాయి. దేశీయ ఫాస్ట్ పేమెంట్స్ సిస్టమ్స్ (ఎఫ్‌పీఎస్) ఇంటర్‌లింకింగ్ ద్వారా ఓ ఇన్‌స్టంట్ క్రాస్-బార్డర్ రిటైల్ పేమెంట్స్ ప్లాట్‌ఫామ్ అభివృద్ధికి బహుళజాతి ఆలోచన ప్రాజెక్ట్ అయిన నెక్స్‌లో భాగస్వామ్యమైనట్టు ఆర్బీఐ ఓ ప్రకటనలో తెలిపింది. బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ సెటిల్మెంట్స్ (బీఐఎస్) ఇన్నోవేషన్ హబ్ కాన్సెప్టే ఈ నెక్స్. దీని ద్వారా తొలుత భారత్, మలేషియా, ఫిలిప్పీన్స్, సింగపూర్, థాయిలాండ్ దేశాల ఎఫ్‌పీఎస్‌ల అనుసంధానం జరుగుతుందని ఆర్బీఐ వివరించింది. ఈ మేరకు జరిగిన ఒప్పందంపై స్విట్జర్లాండ్‌లోని బాసెల్‌లో ఆర్బీఐతోపాటు ఆయా దేశాల సెంట్రల్ బ్యాంకులు, బీఐఎస్ సంతకాలు చేశాయి. మున్ముందు మరిన్ని దేశాలు ఈ కార్యక్రమంలో భాగస్వాములవుతాయని ఆర్బీఐ చెప్పింది.

పూర్తిగా రాని రూ.2వేల నోట్లు

రూ.2వేల నోట్లు పూర్తిగా తిరిగి బ్యాంకుల్లోకి రాలేదని ఆర్బీఐ సోమవారం తెలిపింది. ఇప్పటిదాకా 97.87 శాతం వచ్చినట్టు వివరించింది. ఇంకా రూ.7,581 కోట్ల విలువైన రూ.2వేల నోట్లు ప్రజల వద్దే ఉన్నాయని చెప్పింది. గత ఏడాది మే 19న రూ.2వేల నోట్లను చలామణి నుంచి ఉపసంహరిస్తున్నట్టు ఆర్బీఐ ప్రకటించిన విషయం తెలిసిందే. నాడు వీటి విలువ రూ.3.56 లక్షల కోట్లుగా ఉన్నది. అయితే జూన్ 28 నాటికి ఇది రూ.7,581 కోట్లకు పడిపోయినట్టు ఆర్బీఐ తెలిపింది. దీంతో 97.87 శాతం రూ.2వేల నోట్లు తిరిగి బ్యాంకుల్లోకి వచ్చేశాయని పేర్కొన్నది. ఈ పెద్ద నోట్ల మార్పిడికి ప్రస్తుతం హైదరాబాద్‌సహా దేశంలోని 19 ఆర్బీఐ కార్యాలయాల్లో వీలు కల్పించారు. 2016 నవంబర్‌లో రూ.1000, రూ.500 నోట్ల రద్దు నేపథ్యంలో ఈ రూ.2000 నోట్లు పరిచయమైన సంగతి విదితమే.

కొత్త ఈడీల నియామకం

ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లుగా ఆర్నాబ్ కుమార్ చౌధరి, చారులతా ఎస్ కార్‌లను నియమించినట్టు ఆర్బీఐ వెల్లడించింది. ఈ ఇరువురూ మూడేసి శాఖలను పర్యవేక్షిస్తారని కూడా ప్రకటించింది. కార్ నియామకం సోమవారం నుంచే అమల్లోకి రాగా, చౌధరి నియామకం మాత్రం జూన్ 3 నుంచే వర్తిస్తుంది.

యంగ్‌వన్‌లో దుస్తుల తయారీ!

కంపెనీ చైర్మన్ కిహాక్ సంగ్ వెల్లడి

గీసుగొండ, జూలై 1: వరంగల్ జిల్లాలో టెక్స్‌టైల్ పార్క్‌లో ఏర్పాటు చేసిన ప్లాంట్లో త్వరలో దుస్తుల తయారీని ప్రారంభించనున్నట్లు యంగ్‌వన్ కంపెనీ చైర్మన్ కిహాక్ సంగ్ తెలిపారు. ప్లాంట్ కోసం కేసీఆర్ ప్రభుత్వం 297 ఎకరాల భూమి కేటాయించినట్లు, పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించి గత ప్రభుత్వమే అన్ని రకాల అనుమతులు మంజూరు చేసిందన్నారు. వెయ్యి కోట్లతో నిర్మిస్తున్న ఈ ప్లాంట్ పనులు చివరి దశకు చేరుకున్నాయని, తద్వారా 11 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. ఈ యూనిట్‌లో స్పోర్ట్స్, డ్రెస్ మెటీరియల్స్, జర్కిన్స్, సూట్స్ తదితర దుస్తులు తయారుకానున్నాయి. అలాగే శిక్షణ కేంద్రంలో కుట్టు శిక్షణ తీసుకుంటున్న మహిళల వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఎన్‌సీసీకి 335 కోట్ల ఆర్డర్

హైదరాబాద్, జూలై 1: రాష్ట్రానికి చెందిన ప్రముఖ సంస్థ ఎన్‌సీసీ లిమిటెడ్ ఆర్డర్లు ఆకట్టుకోవడంలో దూసుకుపోతున్నది. గడిచిన నెలలో రూ.335 కోట్ల విలువైన ఆర్డర్లు వచ్చాయని సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. ఈ ఆర్డర్లు బిల్డింగ్ డివిజన్ నుంచి వచ్చాయని తెలిపింది. వీటిలో అంతర్జాతీయ ఆర్డర్లు లేవని పేర్కొంది.

పతంజలి ఫుడ్స్ చేతికి పీఏఎల్ పర్సనల్ కేర్

డీల్ విలువ రూ.1,100 కోట్లు

న్యూఢిల్లీ, జూలై 1: యోగా గురువు బాబా రాందేవ్ నేతృత్వంలోని పతంజలి ఆయుర్వేద్ లిమిటెడ్ (పీఏఎల్)కు చెందిన హోం, పర్సనల్ కేర్ వ్యాపారాన్ని తమ సొంతం చేసుకున్నట్టు పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ సోమవారం ప్రకటించింది. ఈ అంతర్గత లావాదేవీ విలువ రూ.1,100 కోట్లుగా పేర్కొన్నది. ఐదు విడుతల్లో ఈ చెల్లింపులు జరుగుతాయి. కంపెనీ వాటాదారులు, రుణదాతల ఆమోదానికి లోబడి ఈ లావాదేవీ ఉంటుంది. అలాగే దీనికి కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆమోదం రావాల్సి ఉన్నది. ప్రధాన ఎఫ్ఎంసీజీ కంపెనీగా ఎదగడానికే ఈ డీల్‌కు దిగినట్టు దేశీయ వంటనూనెల తయారీ దిగ్గజ సంస్థల్లో ఒకటిగా ఉన్న పతంజలి ఫుడ్స్ సంస్థ తెలిపింది. కాగా, ప్రస్తుతం పతంజలి ఫుడ్స్ ప్రమోటర్లలో పీఏఎల్ కూడా ఒకటిగా ఉన్నది. ఇక ఈ డీల్‌తో హెయిర్ కేర్, స్కిన్ కేర్, డెంటల్ కేర్, హోం కేర్ వ్యాపార విభాగాలు పతంజలి ఫుడ్స్ కిందకు వస్తాయి. ఈ డీల్ ఈ ఏడాది సెప్టెంబర్ ఆఖరుకల్లా పూర్తవగలదన్న ఆశాభావాన్ని పతంజలి ఫుడ్స్ సీఈవో సంజీవ్ ఆస్తానా వ్యక్తం చేశారు.

మైక్రోసాఫ్ట్ ప్రతినిధులతో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

గ్రామీణ ప్రాంతాలకు విస్తరించండి!

మైక్రోసాఫ్ట్‌కు మంత్రి శ్రీధర్ బాబు సూచన

హైదరాబాద్, జూలై 1 (నమస్తే తెలంగాణ): మైక్రోసాఫ్ట్ తన కార్యకలాపాలను గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సూచించారు. డాటా సెంటర్ల విస్తరణ పనులు వచ్చే ఏడాదినాటికి పూర్తి చేయాలని తనను కలిసిన మైక్రోసాఫ్ట్ ఉన్నతాధికారులకు సూచించారు. ఈ భారీ విస్తరణ ప్రణాళిక పూర్తైతే అత్యాధునిక డాటా సెక్యూరిటీ, క్లౌడ్ సొల్యూషన్ రంగంలో హైదరాబాద్ అగ్రస్థానానికి చేరుకుంటుందని ఆశాభావం వ్యక్తంచేశారు. హైదరాబాద్‌లోని మేకగూడ వద్ద 22 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేయతలపెట్టిన డాటా సెంటర్ భూ సేకరణకు సంబంధించి పలు సమస్యలు తలెత్తాయని కంపెనీ ప్రతినిధులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఈ సమస్యను వెంటనే